క్లుప్తంగా

రాయితీపై ఎరువుల అందజేత



తోట్లవల్లూరు: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని బొడ్డపాడు సర్పంచ్ మూడే శివశంకరరావు అన్నారు. మండలంలోని బొడ్డపాడు పీఏసీఎస్‌లో రాయితీపై ఎరువుల పంపిణీని శనివారం ఆయన ప్రారంభించారు. రైతులు తమ వ్యవసాయావసరాలకు సొసైటీల ద్వారా ఎరువులను రాయితీపై పొందాలని సూచించారు. మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ సీతారాంబాబు, పీఏసీఎస్ కార్యదర్శి మురళి, కొత్తపల్లి కిరణ్, కాగిత నాంచారయ్య, ధర్మారావు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకునేందుకు పీ4 కార్యక్రమం

పమిడిముక్కల: పేద కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం పీ4 కార్యక్రమం చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం తెలిపారు. హనుమంతపురం గ్రామంలో శుక్రవారం పీ4 కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించారు. సంపన్నులు పేదలను దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కలపాల రాంబాబు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబూరావు పాల్గొన్నారు.

22 మంది రక్తదానం



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయంలో శనివారం నిర్వహించిన శిబిరంలో 22 మంది రక్తదానం చేశారు. కృష్ణ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచనలతో శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మొవ్వ మండల రెడ్ క్రాస్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివప్రసాద్ చే పరీక్షలు చేసి రక్తం సేకరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లాకోశాధికారి కొండపల్లి రాం బాలాజీ, మేనేజింగ్ కమిటీ మెంబర్ కొత్తగుండు రమేష్, జిల్లా కార్యదర్శి భవిరి శంకర్నాథ్, మొవ్వ సబ్ బ్రాంచ్ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, ఏఎంసి చైర్మన్ దోనేపూడి శివరామయ్య, రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జె హనుమకుమార్, బిహెచ్.వీఆర్ ఎస్. సాయి తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వర స్వామి దేవస్థానానికి వితరణ



గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం రాజగోపురం నిర్మాణానికి భక్తులు వితరణ అందజేసినట్లు ఆలయ ఈఓ కె. వేణుగోపాలరావు తెలిపారు. శనివారం పట్టణానికి చెందిన కె. దుర్యోధనరావు రూ.10,116 విరాళం అందజేశారని పేర్కొన్నారు. రాజగోపురం 5వ అంతస్తు పనులకు ఈ విరాళం వినియోగిస్తామని ఆయన తెలిపారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి



ముదినేపల్లి రూరల్: రెవెన్యూ సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సూచించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి తహసీల్దార్‌కు పలు సూచనలు చేశారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి కార్యాలయానికి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా సకాలంలో సమస్యలు పరిష్కరిస్తేనే రెవెన్యూ శాఖపై గౌరవం ఏర్పడుతుందన్నారు. ప్రధానంగా భూముల సమస్యలకు సంబంధించి అనేక ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. వీటిని సమగ్రంగా పరిశీలించి రైతులకు తగిన న్యాయం చేయాలన్నారు. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా మండలాన్ని ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు సిబ్బంది గ్రామ స్థాయి నుంచి కృషి చేయాలన్నారు.

వేలం పాట వాయిదా

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానం ప్రాంగణంలోని కొబ్బరికాయలు, పూజాద్రవ్యాల విక్రయ దుకాణం వేలం పాటను శనివారం నిలిపివేశారు. అనివార్య కారణాలతో దుకాణాల వేలంపాటను వాయిదా వేస్తున్నట్లు దేవదాయ శాఖ అధికారులు వెల్లడించారు. కాగా ఈ వేలం పాట వ్యవహారంలో టీడీపీ, జనసేన నేతల మధ్య అభిప్రాయ భేదాలు ఏర్పడటంతో ఆలయ కార్యనిర్వాహణాధికారి వాయిదా వేసినట్లుగా సమాచారం.

నిదీష్ జాడెక్కడ..?

- ఎనిమిది రోజులు గడుస్తున్నా దొరకని ఆచూకీ
- ప్రత్యేక బృందాలతో పోలీసుల గాలింపు



అదృశ్యమైన నిదీష్



కేఈబీ కాలువలో రబ్బరు ట్యూబుల ద్వారా గాలింపు చర్యలు

తోట్లవల్లూరు: రొయ్యూరులో అదృశ్యమైన పడమట నిదీష్(10) ఆచూకీ ఇంత వరకు లభ్యం కాలేదు. ఇంటి పరిసరాల్లో ఆడుకుంటూ అదృశ్యమై ఎనిమిది రోజులు గడుస్తున్నా బాలుడి జాడ తెలియకపోవటం అందరినీ కలవరపరుస్తోంది. పామర్రు మండలం నిమ్మకూరు గ్రామానికి చెందిన పడమట దుర్గా శ్రీనివాసరావు, సరోజిని దంపతుల కుమారుడు నిదీష్ తన చెల్లెలితో కలిసి రొయ్యూరులోని అమ్మమ్మ ఇంటికి ఈ నెల 12న మధ్యాహ్నం తన మేనమామ వీరంకి బాలకృష్ణ బైక్‌పై వచ్చిన విషయం విదితమే. ఇంటి ఆవరణలో ఆడుకుంటూ సాయంత్రం 4.45 గంటల తరువాత నిదీష్ అదృశ్యమయ్యాడు. బాలుడు అదృశ్యమై ఎనిమిది రోజులు గడుస్తున్నా ఇంత వరకు ఎలాంటి ఆచూకీ లభ్యం కాకపోవటం మిస్టరీగా మారింది. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న తమ కుమారుడి అదృశ్యంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

నాలుగు బృందాల ఏర్పాటు

నిదీష్ అదృశ్య ఘటన పోలీసులకు సవాల్‌గా మారింది. గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆదేశాలతో పమిడిముక్కల సీఐ వై. చిట్టిబాబు కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని బాలుడి ఆచూకీ కనిపెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తూ ముందుకు సాగుతున్నారు. నిదీష్ ఆచూకీ కనుగొనేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విజయవాడ, కంకిపాడు, ఉయ్యూరు, పామర్రు పరిసరాల్లో గాలింపు జరుపుతున్నారు. కుటుంబసభ్యులను సైతం విచారిస్తూ నిదీష్ అదృశ్యానికి గల కారణాలను వెలికితీసే పనిలో ఉన్నారు.

డ్రోన్లతో గాలింపు

ఒకవైపు విజయవాడ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు చేపడుతూనే మరో వైపు కేఈబీ కాలువపై కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేసి కేఈబీ కాలువపై నుంచి గాలింపు నిర్వహిస్తున్నారు. అలాగే కాలువలో రబ్బరు ట్యూబుల ద్వారా కూడా గాలింపు ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా నిదీష్ ఆచూకీ మాత్రం లభ్యం కావటం లేదు. ఇంటి పక్కనే ఉన్న కేఈబీ కాలువలో పడి బాలుడు గల్లంతయ్యాడా లేక ఎవరైనా కిడ్నాప్‌కు పాల్పడ్డారా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది.

వర్షం నీటితో మునిగిన బాడవ పొలాలు



ముంపునకు గురైన తాడంకి పరిధిలోని పొలాలు

1,500 ఎకరాల్లో వరి నీటమునక

పమిడిముక్కల: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరినాట్లు వేసిన పొలాలు ముంపునకు గురయ్యాయి. మంటాడ, గురజాడ, తాడంకి, గోపువానిపాలెం పరిధిలో రెండువేల ఎకరాల బాడవ పొలాలున్నాయి. వీటిలో సుమారు 1,500 ఎకరాల్లో నాట్లు వేశారు. వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న నీటితో పొలాలు ముంపునకు గురయ్యాయి. పొలాల్లోని మురుగు కనుమూరు డ్రెయిన్‌లోకి వెళ్లాల్సి ఉంది. తమ పొలాలు ముంపునకు గురవుతాయని కనుమూరు రైతులు తూములు వద్ద పూడ్చివేశారు. దీంతో మురుగునీరు దిగువకు పోయేందుకు వీలులేక నాలుగు గ్రామాల పరిధిలోని పొలాలు ముంపునకు గురయ్యాయి. కనుమూరు రైతులు తూముల వద్ద వేసిన అడ్డుకట్టలు తొలగించి, మురుగునీరు పోయే ఏర్పాట్లు చేయాలని తాడంకి, గురజాడ, మంటాడ, గోపువానిపాలెం సర్పంచ్‌లు జంపాన ధనలక్ష్మి, జంపాన వెంకటేశ్వరరావు, నందమూడి వీరమ్మ, భూషయ్య ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

తోట్లవల్లూరు: వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం మండలంలోని భద్రిరాజుపాలెంలో ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. స్థానిక కల్యాణ మండపంలో సాయంత్రం నాలుగు గంటలకు జరిగే ఈ సమావేశానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

22న విద్యుత్ గ్రీవెన్స్ ఫోరం

గుడివాడ టౌన్: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారం, ఇతర అంశాలకు సంబంధించి విద్యుత్ కన్జ్యూమర్ గ్రీవెన్స్ ఫోరం ఏర్పాటు చేసినట్లు ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 10.30 గంటలకు హనుమాన్ జంక్షన్‌లోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో ఈ ఫోరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్, ఫోరం సభ్యులు, సూపరింటెండెంట్ ఇంజినీర్ మచిలీపట్నం, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు. డివిజన్ పరిధిలోని వినియోగదారులు తమ సమస్యలు ఈ ఫోరంలో పరిష్కరించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను అరెస్ట్



గొర్ల శ్రీనును పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న వన్‌టౌన్ సీఐ, పోలీసులు

గుడివాడరూరల్: వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీనును పోలీసులు అరెస్ట్ చేశారు. భాస్కర్ థియేటర్ వెనుక రోడ్డులో వైఎస్సార్ సీపీ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు అడబాల అప్పారావు కార్యాలయంలో శనివారం రాత్రి బాబూ ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమ నిర్వహణపై వైఎస్సార్ సీపీ నాయకులు సమావేశమయ్యారు. ఈ క్రమంలో సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని సెక్షన్-30 అమలులో ఉందని సమావేశం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, వన్‌టౌన్ సీఐల మధ్య స్వల్ప వివాదం తలెత్తింది. ఈ క్రమంలో గొర్లతో పాటు నాయకులను టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై గొర్ల, నాయకులను విడుదల చేశారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్కడ నుంచి వెనుతిరిగారు.

నేడు గంగానమ్మ బోనాల జాతర

మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రు గ్రామంలో వేంచేసియున్న శ్రీగంగానమ్మ తల్లి బోనాల జాతర కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బోయిన శివయ్య శనివారం తెలిపారు. తెలంగాణా రాష్ట్రంలో మాదిరిగా ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాల తీసుకుని వచ్చి గ్రామం మొత్తం తిరిగి అమ్మవారికి సమర్పిస్తారని పేర్కొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

పమిడిముక్కల: కూటమి ప్రభుత్వం ఏడాది నుంచి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పిలుపునిచ్చారు. మండలంలోని అలీనఖీపాలెంలో శనివారం సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీ సభ్యుల నియామకం



కైకలూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో కైకలూరు నియోజకవర్గానికి చెందిన ఏలూరు జిల్లా అనుబంధ విభాగాల కమిటీలలో వివిధ హోదాలలో పలువురిని శనివారం నియమించారు. ఈ మేరకు తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి నియమితులైన వారి జాబితా విడుదలైంది.

ఏలూరు జిల్లా యూత్ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా రామిశెట్టి అఖిలాష్, జనరల్ సెక్రటరీగా అబ్దుల్ మాలిక్, సెక్రటరీగా పేటేటి మహేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గొంతుపులుకు వంశీ, తలారి శివాజీ, ఏలూరు జిల్లా మహిళా విభాగం కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా నంబూరు శ్రీదేవి, జనరల్ సెక్రెటరీగా మన్నెం రమాదేవి, సెక్రటరీగా అర్జా విజయదుర్గ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బిరుదుగడ్డ రాజామణి, సాకా జసంతను నియమించారు.

- ఏలూరు జిల్లా రైతు విభాగ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా గుడివాడ వీర రాఘవయ్య(తంబి స్వామి), జనరల్ సెక్రటరీగా ఒడుపు రామారావు, సెక్రటరీగా జాస్తి బాబూ రాజేంద్రప్రసాద్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా పడమటి శేషావతారం, ఏలూరు జిల్లా బీసీ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా బత్తిన కిషోర్, జనరల్ సెక్రెటరీగా తోకల జగన్మోహనరావు, సెక్రటరీగా బోనం శేషగిరి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రాజులపాటి శివనాగలక్ష్మీ, మోకా రామకృష్ణ నియమితులయ్యారు.
- ఏలూరు జిల్లా ఎస్సీ సెల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా సాధు కొండయ్య, జనరల్ సెక్రటరీగా బేతపూడి వెంకటరమణ, సెక్రటరీగా గద్దె ఆనంద్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా దాసరి శ్యాం కుమార్, ఎస్టీ కమిటీ జనరల్ సెక్రటరీగా సికా రాణి, సెక్రటరీగా బిడ్డికి రామకృష్ణ(బాబ్జి) ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నల్లగోడ సతీష్,చొప్పాడు కనకారావును నియమించారు.
- మైనారిటీ సెల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా జమీల్ షరీఫ్(చిన బాషా) జనరల్ సెక్రటరీగా షేక్ రఫీ సెక్రెటరీగా మహమ్మద్ ఆసీఫ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా షేక్ అల్లాభక్షు, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా దాసి ఏసుబాబు, జనరల్ సెక్రటరీగా గద్దం శ్యామలరావు, సెక్రటరీగా వెంట్రప్రగడ ప్రదీప్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా గోవాడ శేఖర్ నియమితులయ్యారు.
- ఏలూరు జిల్లా స్టూడెంట్ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా కూసంపూడి యశ్వంత్ వర్మ, జనరల్ సెక్రటరీగా ఉచ్చుల శ్రావణ్, సెక్రటరీగా నువ్వుల సందీప్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా దోమ భాగ్యరాజ్, పంచాయతీరాజ్ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా పడవల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా శీలం రామకృష్ణ, సెక్రటరీగా శొంఠి వీర ముసలయ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా అనగాని రామకృష్ణ ప్రసాదు, కొయ్య గంగయ్యను నియమించారు.
- వలంటరీ వింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా పగడాల నాగు, జనరల్ సెక్రటరీగా జంగం మధు సుందర బాబు(మధు)ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వట్టిప్రోలు అర్చన, పెమ్మ గోపి, వాణిజ్య విభాగ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా వర్రె పాండురంగారావు, జనరల్ సెక్రటరీగా నామాన అన్నవరం, సెక్రటరీగా సొంటి కుమార్ స్వామి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కేతలి పార్థసారథి, ఇందూరు సుబ్రహ్మణ్యంను నియమించారు.

శాకంబరిగా కన్యకాపరమేశ్వరి

పెడన: స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరిదేవి శనివారం భక్తులకు శాకంబరి దేవిగా దర్శనమిచ్చింది. కన్యకాపరమేశ్వరి అమ్మవారిని వివిధ రకాల కూరగాయాలు, ఆకు కూరలతో సుందరంగా అలంకరించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో వివిధ ఆర్యవైశ్య సంఘాలు, వాసవి మహిళా మండలి సభ్యులు శాకంబరి అలంకరణ చేశారు. ఆదివారం పట్టణంతో పాటు మండలంలోని ఆర్యవైశ్యులకు అమ్మవారి అన్న ప్రసాదాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ 'తల్లికి వందనం' ఇవ్వాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుడివాడ టౌన్ : అర్హులైన ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్. సమరం డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలు విద్యార్థులు లేవనెత్తుతున్నారన్నారు. తల్లికి వందనం ప్రతి విద్యార్థికి ఇచ్చామని ప్రభుత్వం చెబుతుందన్నారు. శనివారం కొన్నిపాఠశాలల్లో పర్యటించగా అనేకమంది తమ ఖాతాల్లో తల్లికి వందనం సొమ్ము పడలేదని చెబుతున్నారన్నారు. ఈ విషయంపై మంత్రి సమాధానం చెప్పాలన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేస్తామని చెప్పిన ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టి తల్లికి వందనం నిలుపుదల చేయడం సరికాదన్నారు. పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల్లో మౌలిక వసతులు సన్నగిల్లాయన్నారు. పట్టణ పరిధిలోని అన్ని పురపాలక సంఘ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హారిక, మండల కార్యదర్శి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



పెదపూడిలో నాయకులతో యారా సాయి ప్రశాంత్

మొవ్వ: ఇటీవల వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన యారా సాయి ప్రశాంత్ తన స్వస్థలమైన మొవ్వ మండలంలో పలు గ్రామాల్లో శనివారం పర్యటించి పార్టీ బలోపేతాని కోసం చర్చలు జరిపారు. మండలంలోని పెదపూడి గ్రామ సర్పంచ్ తాతా రజిని, నాయకులు తాతా రాంబాబు, పులి లక్ష్మిలను పార్టీ మండలాధ్యక్షులు రాజలుపాటి రాఘవరావుతో కలిసి వెళ్లి పార్టీ స్థితిగతుల పై చర్చలు జరిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యారా వేణు, ఏనుగు మోహనరావు, గొరుముచ్చు రాజేష్ పాల్గొన్నారు. అదేవిధంగా జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర మండల పరిధిలోని భట్లపెనుమర్రు, కూచిపూడి, అయ్యంకి, పెడసనగల్లు, చినముత్తేవి, పెదపూడి, అవురుపూడి గ్రామాల్లోని పలువురు నాయకులను కలిశారు.,

పరిసరాల శుభ్రతలో భాగస్వాములు కావాలి



తోట్లవల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తోట్లవల్లూరు: పరిసరాల శుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని ఉయ్యూరు డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి రాజేష్ పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా తోట్లవల్లూరులో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను డీఎల్‌డీఓ రాజేష్ వివరించారు. సర్పంచ్ పెనుమత్స రాధిక, ఎంపీడీఓ రవికాంత్, ఎంఈఓ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి కార్యదర్శి రవికుమార్, పంచాయతీ, సచివాలయాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వద్దు



ముదినేపల్లిలో స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్, అధికారులు

కైకలూరు: ప్రజలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని కైకలూరు మండలం ప్రత్యేకాధికారి, ఏలూరు జిల్లా మత్స్యశాఖ జేడీ నరసయ్య పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం జరిగే అవగాహన ర్యాలీని కైకలూరు, కలిదిండి మండలాల్లో శనివారం నిర్వహించారు. కైకలూరులో ఎంపీపీ అడవి కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ర్యాలీగా వెళ్లి పలు దుకాణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వద్దు, జనపనార సంచులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామకృష్ణ తదతరులు పాల్గొన్నారు. కలిదిండిలో ఎంపీడీఓ ఆర్.ఫణింద్ర ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ చేశారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. నాయకులు చిట్టూరి రవీంద్ర, పంచాయతీ ఈఓ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు. అదే విధంగా కైకలూరు రైతు బజార్ వద్ద పాస్టిక్‌ను నిషేధించాలని ఎస్టేట్ ఆఫీసర్ పి.నందిని దేవీ ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కలిగించారు.

గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మూడో శనివారం సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, అధికారులు, కార్యదర్శులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ముదినేపల్లి సెంటర్లో సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. గురజ సెంటర్లో ఎంపీడీఓ వై రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక ప్రముఖులు వేల్పూరి నానాజీ, మీసాల సత్యనారాయణ పాల్గొన్నారు.



కైకలూరు తాలూకా సెంటర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ



కలిదిండి సెంటర్‌లో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిపై అవగాహన

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీస్ కాలేజీలో శనివారం విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమతో అనుసంధానం అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వల్లూరు లావణ్య(టీఏఓ డిజిటల్ సొల్యూషన్స్) మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంపిక చేసుకొని ఆ దిశగా పట్టుదలతో చదివినట్టయితే ప్రతిభావంతులు కాగాలరని అన్నారు. పలు సంస్థల హెచ్ఆర్‌లు భానుప్రకాష్, డాక్టర్ అబ్దుల్ రహీద్, ఎం.శివప్రసాద్, గణేష్ సోమిశెట్టి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.కీర్తిరెడ్డి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

కంకిపాడు: రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్స్ అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు ఎంసీహెచ్ ఖాశిం డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మట్లాడారు. ఈ ఏడాది జూన్ నుంచి రేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీ బాధ్యతలు డీలర్లకు అప్పగించారని తెలిపారు. 65 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు నేరుగా ఇళ్లకు వెళ్లి రేషన్ అందిస్తున్నామన్నారు. పదేళ్లుగా రేషన్ డీలర్ల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. 2018నుంచి చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పిన జీఓలు అమలు కావడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న భవిష్యత్ కార్యాచరణపై ఈనెల 20వ తేదీ ఉదయం 10గంటలకు విజయవాడ రాఘవయ్యపార్క్ వద్ద గల మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర డీలర్ల సమాఖ్య అధ్యక్షుడు దివి లీలా మాధవరావు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి రేషన్ డీలర్లు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

మత్స్యకారుల కుటుంబాలకు బీమా పరిహారం ఇవ్వాలి

పెనమలూరు: చేపల వేట చేస్తూ ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణం బీమా పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు డిమాండ్ చేశారు. ఆయన శనివారం పోరంకిలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కృష్ణాజిల్లా నాగాయలంక, జింకలపాలెం, గుల్లలమోద, సంగమేశ్వరం గ్రామాలకు చెందిన ఐదుగురు మత్స్యకారులు చేపలవేట చేస్తూ ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందారన్నారు. వీరు మరణించి ఏడాది కావొస్తున్నా వారి కుటుంబాలకు బీమా పరిహారం అందలేదన్నారు. మత్స్యకారుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాగాయలంకకు చెందిన మేడా కృపారావు అనే మత్స్యకారుడు గత 8 నెలల క్రితం ప్రమాదవశాత్తు మృతిచెందగా బీమా అందలేదన్నారు. మృతుడి కుమారుడు బీటెక్ చదువుతున్నాడని ఫీజుకు సొమ్ము లేక చదువు మాని కూలీ పనులకు వెళుతున్నాడని అన్నారు. మృతుల కుటుంబాలు వీధిన పడక ముందే ప్రభుత్వం మృతిచెందిన మత్స్యకారుల కుటుంబాలకు బీమా సొమ్ము వెంటనే ఇవ్వాలని కోరారు.